సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024




దళిత వాడలను పంచాయతీలు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి జనాభా దాటిన ప్రతి దళిత వాడను పంచాయతీగా గుర్తించాలని అడిషనల్ డీజీపీ సునీల్‌కుమార్ కోరారు. 9లో



నేత్రపర్వం.. నిత్య కల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం నేత్ర పర్వంగా జరిగింది.



ఘనంగా మాఘ మాసోత్సవాలు

విశాఖ: అల్లిపురంలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో శనివారం మాఘ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

అనకాపల్లి: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈవో) బి.సుజాత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 60 కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, 5,279 మంది ఎంపీసీ, 2,821 మంది బైపీసీ విద్యార్థులు కలిపి మొత్తం 8,100 మంది పరీక్షలకు హాజరుకానున్నారని ఆమె పేర్కొన్నారు.

మహిళపై పెట్రోలుతో దాడి

- వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఘాతుకం

మాడుగుల: తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఓ మహిళ మరో మహిళపై పెట్రోలు పోసి నిప్పంటించిన సంఘటన మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ కాశీపురంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ దామోదర నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాశీపురం గ్రామానికి చెందిన అల్లంగి చిన్నమ్ములు అలియాస్ చిన్నారి, తన భర్త పోతురాజుతో కలిసి నివాసం ఉంటోంది. అదే గ్రామానికి చెందిన లక్ష్మి తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించింది. లక్ష్మి శరీరం తీవ్రంగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిన్నమ్ములుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

యూపీహెచ్‌సీలో రెండో రోజు కేంద్ర బృందం తనిఖీ



కొట్నీ వీధి యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న విద్యాధరన్

అనకాపల్లి : స్థానిక 84వ వార్డు కొట్నీ వీధిలోని యూపీహెచ్‌సీని కేంద్ర క్వాలిటీ కంట్రోల్ బృందం సభ్యులు రెండో రోజు శనివారం పరిశీలించారు. నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన నోడల్ అధికారి డాక్టర్ నజియా షాహీన్, కేరళకు చెందిన డీఎంహెచ్‌వో పీఎస్ విద్యాధరన్ యూపీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నూతన భవనంలో ఇప్పటి వరకు ఎంత మంది రోగులకు చికిత్స అందించారన్న విషయాన్ని రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నివేదికను కేంద్ర క్వాలిటీ కంట్రోల్ విభాగానికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎం.మణికంఠ, యూపీహెచ్‌సీ వైద్యుడు నాగేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’లో రికార్డు



ఉపాధి హామీ పథకంలో అత్యధికంగా ఎస్టీలకు పనులు కల్పించడంలో రాష్ట్రంలో మొదటి స్థానం, వేతనాలు చెల్లించడంలో రెండవ స్థానాన్ని జిల్లా సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని మించి పనిదినాలు కల్పించారు. అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు అందజేస్తూ పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించడంతో జిల్లా నుంచి వలసలను నివారించగలిగారు.

- ఎస్టీ కుటుంబాలకు పనుల కల్పనలో జిల్లాకు మొదటి స్థానం
- వేతనాల చెల్లింపులో ద్వితీయస్థానం
- లక్ష్యానికి మించి ఇప్పటివరకూ 1,09,68,000 పని దినాల కల్పన
- ఈ నెలాఖరు నాటికి మరో ఐదు లక్షల పనిదినాలు
- నమోదైన ఎస్టీ కుటుంబాల్లో 85 శాతం మందికి ఉపాధి
- ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా పనుల కేటాయింపు
- ఒక పని పూర్తయితేనే మరో పనికి అవకాశం
- పెండింగ్ పనులకు ఆస్కారం లేకుండా చర్యలు

మొక్కలకు కుంటలు తీస్తున్న ఉపాధి కూలీలు (ఇన్‌సెట్) ఉపాధి పనులతో నిర్మించిన చెరువు గట్టు



సాక్షి, అనకాపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో పెద్ద ఎత్తున పనులు నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు కల్పించి రికార్డు సృష్టించారు. ఈ పథకంలో నమోదైన ఎస్టీ కుటుంబాల్లో 85 శాతం కుటుంబాలకు పని కల్పించి రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, రూ.287.45 కోట్ల వేతనాలు చెల్లించి రెండో స్థానం సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం కోటి పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఆ లక్ష్యాన్ని మించి ఇప్పటి వరకు 1,09,68,000 పని దినాలు కల్పించారు. ఈ నెలాఖరు నాటికి మరో 5 లక్షల పని దినాలు కల్పించనున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు, ఉపాధి సిబ్బంది కృషితో ఇది సాకారమైంది. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు ఆలస్యం లేకుండా పేమెంట్లు కూడా చెల్లిస్తున్నారు. కూలీలు చేసిన పనులకు సంబంధించిన పేమెంట్లు వారి బ్యాంకు అకౌంట్లకు నేరుగా జమ అవుతున్నాయి. ఉపాధి పనుల పర్యవేక్షణకు క్లస్టర్ ఏపీడీలు, ప్రతి మండలంలో ఏపీవో, ఈసీ, టీఏలు అందుబాటులో ఉన్నారు. కూలీలు చేసిన పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధంగా ప్రతి మండలంలోనూ ప్రత్యేక సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు.

వ్యవసాయంగా ఉపాధి..

రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేపడుతున్నారు. పంట కాలువలు, చెరువులు, చెక్ డ్యామ్‌లు తదితర పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. వారం రోజుల ముందుగా ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా పనులు కేటాయిస్తారు. ఒక పని పూర్తయితేనే మరో పనికి అవకాశం కల్పించడంతో పాటు పెండింగ్ పనులకు ఆస్కారం లేకుండా డ్వామా అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. యంత్రాలతో కాకుండా కూలీల చేత పనులు చేపడుతున్నారు. ఉపాధి పనుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు చాలా వరకు తగ్గాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధి పనులకు కూలీలు అధికంగా హాజరవుతున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా ...

మండలాలు	: 24
పంచాయతీలు	: 645
జాబ్ కార్డులు	: 2,84,888
వేతనదారులు	: 3,00,031
ఇప్పటి వరకూ జరిగిన పనులు	: 3,00,758
పని దినాలు	: 1,09,68,000
రోజుకు సగటు వేతనం	: రూ.267
ఒక్కో కుటుంబానికి సగటు ఉపాధి దినాలు	: 53

ప్రత్యేక బృందాలతో పరిశీలన

ఎటువంటి అక్రమాలకు తావులేకుండా ఉపాధి పనులను ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాయి. పనులు జరిగిన తీరు తదితర అంశాలను పరిశీలించి సోషల్ ఆడిట్ నిర్వహించి రికవరీలు చేస్తున్నారు. పథకాన్ని ఎవరైనా దుర్వినియోగం చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. చేయని పనులు చేసినట్టు నమోదు చేయడం, బిల్లులు చేసిన పనులకు మళ్లీ బిల్లులు చెల్లించడం, కూలీలతో చేయాల్సిన పనులు యంత్రాలతో చేసి వాటికి బిల్లు పెట్టేవారిపై చర్యలు తప్పవని డ్వామా అధికారులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలోనే నంబర్-1



నమోదైన ఎస్టీల కుటుంబాల్లో 85 శాతం కుటుంబాలకు ఉపాధి కల్పించి రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు అందిస్తున్నాం. కొత్త వారు ఎవరు నమోదు చేసుకున్నా జాబ్ కార్డు ఇస్తున్నాం. జిల్లాలో కార్డులున్న వారందరికీ, వ్యవసాయ కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.09 కోట్ల పని దినాలు కల్పించాం. నిర్దేశించిన లక్ష్యాన్ని మించి పని దినాలు పూర్తిచేశాం. ఈ నెలాఖరు నాటికి మరో ఐదు లక్షల పని దినాల కల్పనే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం.

– సందీప్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్

ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ పనిచేస్తారు.

జోరుగా గోవాడ సుగర్స్ క్రషింగ్

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ జోరుగా సాగుతోంది. ఈ ఏడాది ఫ్యాక్టరీ ఏరియాలో కొంత మేర చెరకు విస్తీర్ణం తగ్గడంతో చెరకు సరఫరాపై మొదట్లో కొంత ఆందోళన ఏర్పడింది. అయితే ప్రారంభించిన 41 రోజుల్లో 94 వేల టన్నుల క్రషింగ్ జరిగింది. రికవరీ శాతం కూడా ఆశాజనకంగా ఉంది. ఈఏడాది ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు తగ్గడంతో రెండు లక్షల టన్నులు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ నుంచి రెగ్యులర్ క్రషింగ్ చేపట్టి ఇప్పటివరకూ 41 పనిదినాల్లో 94వేల టన్నులు క్రషింగ్ చేయగా రోజువారీ రికవరీ 9.90 శాతం, సరాసరి రికవరీ 8.56 శాతం వస్తోంది. 72,840 క్వింటాళ్ల పంచదారను ఇప్పటి వరకూ ఉత్పత్తి చేశారు. కోజనరేషన్ ప్లాంట్ ద్వారా 3,98,900 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగించి, మిగతా యూనిట్లను ఏపీట్రాన్స్‌కోకు విక్రయిస్తున్నారు. క్రషింగ్‌కు సీజన్ ముగియడానికి మరో రెండునెలల సమయం ఉండడంతో లక్ష్యాన్ని చేరుకుంటామనే ధీమా ఫ్యాక్టరీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతుల పాతబకాయిలు, కార్మికుల జీతభత్యాల కోసం రూ. 13.40 కోట్లు గ్రాంట్‌గా ఇవ్వడంతో మొత్తం బకాయిలు చెల్లింపు చేశారు. దీంతో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసేందుకు రైతులు మరింత ఆసక్తి చూపున్నారని ఫ్యాక్టరీ ఎండీ వి.వి. సన్యాసినాయుడు చెప్పారు.

● పల్లెల్లో ప్రగతి 8లో



పల్లె ప్రగతి పథంలో పరుగులుపెడుతోంది. ఇన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైన గ్రామాల దశ తిరిగింది. ఊళ్లలో ఉత్సాహం ఉప్పొంగుతోంది. కె.కోటపాడు మండలంలోని పది గ్రామాల్లో రూ.17.18 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం ప్రారంభించారు.

● పడతుల్లో ఆనందం 8లో



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా రుణాలు మాఫీ చేయడంతో అక్కచెల్లెమ్మలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగవ విడతలో రావికమతం, రోలుగుంట మండలాల డ్వాక్రా సభ్యులకు శనివారం ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నేవీ నిర్వాసితులకు రూ. 28.74 కోట్లు మంజూరు

- ఒక్కొక్కరికీ రూ.1.30 లక్షలు
- 2,211 మందికి లబ్ధి
- సోమవారం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు వెల్లడి



రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు జీవన భృతి ప్యాకేజీ మంజూరైనట్టు ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు జీవనభృతి వివరాలను వెల్లడించారు. వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకు చెందిన 2,211 మంది నేవీ నిర్వాసితులకు ఒక్కొక్కరికీ రూ.1.30 లక్షల చొప్పున మొత్తం రూ.28,74,30,000 మంజూరయ్యాయని, ఈ నగదును సోమవారం నుంచి లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం ప్రారంభమై వారం, పది రోజుల్లో మొత్తం లబ్ధిదారులందరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు జీవన భృతి కోసం ధర్నాలు చేశారని, నిర్వాసితుల ఆవేదనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి జీవనభృతి ప్యాకేజీ మంజూరు చేయాలని కోరానన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేవీ నిర్వాసితులకు ప్యాకేజీ మంజూరు కావడం ఆనందం ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

నిర్వాసితుల్లో ఆనందం

జీవన భృతి ప్యాకేజీ కోసం సుదీర్ఘకాలంగా నేవీ నిర్వాసితులు పోరాడుతున్నారు. ధర్నాలు, ఆందోళనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు అండగా నిలిచింది. అర్హులైన 2,211 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. వీరికి రూ.1,30,000 చొప్పున ప్యాకేజీ మంజూరు చేసింది. దీంతో వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. భారీ ప్యాకేజీ మంజూరు కావడంపై పార్టీలకతీతంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సొమ్ము తమ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. తమ పోరాటాలకు ఫలితం దక్కిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండో రోజు హోరాహోరీ

- ఉత్కంఠభరితంగా ఆడుదాం ఆంధ్రా
- ఎనిమిది వేదికల్లో ఐదు క్రీడాంశాల్లో పోటీలు
- సత్తా చాటుతున్న క్రీడాకారులు





పోటీలో తలపడుతున్న క్రీడాకారులు





విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. నగరంలోని ఎనిమిది వేదికల్లో.. ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. మెన్ వాలీబాల్ పోటీల్లో భాగంగా శనివారం జరిగిన పోరులో అనకాపల్లి జట్టు 2–1తేడాతో అనంతపురం జట్టుపై విజయం సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకుంది. మెన్ ఖోఖోలో విశాఖపట్నం జట్టు 17–14 తేడాతో ఎన్టీఆర్ జట్టుపై విజయం సాధించింది. వుమెన్ బ్యాడ్మింటన్‌లో విశాఖ జట్టు 2–0 సెట్స్‌తో కోనసీమ జట్టుపై విజయం సాధించింది. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో జరిగిన వుమెన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, విజయనగరం, ప్రకాశం, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలకు చెందిన జట్లు విజయం సాధించాయి. స్టీల్ ప్లాంట్, ఏఎంసీ, కొమ్మాది కేవీకే స్టేడియంలో మెన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అన్నమయ్య జిల్లా, పల్నాడు, వైఎస్సార్ కడప, తిరుపతి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జట్లు విజయం సాధించాయి. మెన్, వుమెన్‌కు ఏయూ గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తుండగా.. వుమెన్ వాలీబాల్‌లో కాకినాడ, బాపట్ల, కృష్ణా, గుంటూరు, అనకాపల్లి జిల్లా జట్లు గెలుపొందాయి. మెన్‌లో ప్రకాశం, నెల్లూరు, పార్వతీపురం మన్యం జట్లు విజయం సాధించాయి.

విజేతలు వీరే..

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ఫైనల్స్‌లో భాగంగా రెండో రోజు జరిగిన పోటీల్లో విజేతలు వీరే..

బ్యాడ్మింటన్: ఎంవీపీకాలనీలోని జీవీఎంసీ ఎస్–3 ఎన్‌క్లేవ్‌లో జరిగిన వుమెన్ పోటీల్లో పెదవాల్తేర్ 2, స్వర్ణా 2, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, ఎస్.కోట 4, రమణయ్యపేట 2, యముజాలవారి వీధి, శంకరాపురం 4, దైదా, వేటమామిడి జట్లు విజయం సాధించాయి. మెన్‌లో శేఖర్ వీధి, కాగితాల పెంట, నెహ్రూ చౌక్, బేరిపేట, చోడవరం 3, మేట్ల కాలనీ సచివాలయం జట్లు గెలుపొందాయి.

క్రికెట్: ఏఎంసీలో జరిగిన మెన్ క్రికెట్ పోటీల్లో అలమండ 1, కవిటి 1, అనపర్తి 4 జట్లు విజయం సాధించగా స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన పోటీల్లో మధురానగర్ 15, గుర్రంకొండ 2, మల్లమ్మ సెంటర్, లైట్‌పల్లెం సెంటర్ సచివాలయం జట్లు గెలుపొందాయి. వైఎస్సార్ స్టేడియం బీ మైదానంలో జరిగిన మహిళల క్రికెట్‌లో వెంకటాపురం, షికారుగంజి, చిరికూరపాడు, సిద్ధార్థ నగర్ సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి. కొమ్మాది కేవీకే స్టేడియం మైదానంలో జరిగిన మెన్ పోటీల్లో ఎంఆర్ పల్లి 2, గోరిజవోలు, కురుడు సెక్రటేరియట్ జట్లు గెలుపొందాయి.

వాలీబాల్: ఏయూ సిల్వర్ జూబ్లీగ్రౌండ్స్‌లో వాలీబాల్ పోటీలు జరుగుతుండగా వుమెన్‌లో మామిడాలపాడు1, గుంతపల్లి, గౌరీశంకరాపురం, మున్సిఫ్ జంక్షన్, నిజామపట్నం 3, మెన్‌లో గంగపట్నం 1, 189 కొత్తపల్లే, బేతపూడి, గంగపట్నం1, గామల్లపాలెం, చినపచ్చిల సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి.

కబడ్డీ: ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతున్నాయి. కబడ్డీ వుమెన్‌లో కారేడు 3, శంకడ, రామారావు కాలనీ, ఆమకతడు, పేరూరు1, నల్లచెరువుపల్లి, లాసన్స్‌బే కాలనీ సెక్రటేరియట్ జట్లు, కబడ్డీ మెన్‌లో గోలెగండ్ల 3, కొత్తపాలెం 2, చింతలపూడి 1, సింగుపురం 1, రాజాం సెక్రటేరియట్ జట్లు విజయం సాధించాయి.

ఖోఖో: మహిళా పోటీల్లో చిడుమూరు, కొండాయపాలెం, కుప్పిలి 1, సత్యనారాయణ కాలనీ, ఖాజీపాలెం, సంజయ్‌గాంధీనగర్, నాగులాపురం సెక్రటేరియట్ జట్లు, మెన్‌లో ముతుకూరు1, నిడమర్రు 2, నిడుగుర్తి, పెద్దారుకురు, పంగలూరు1, లంకెలపాలెం సెక్రటేరియట్ జట్లు గెలుపొందాయి.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- గ్రామాల్లో సందడిగా ప్రారంభోత్సవాల పండగ
- 10 గ్రామాల్లో రూ.17.18 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులు


లంకవానిపాలెంలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి


వారాడలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ, డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సంక్షేమ పథకాలందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంతే సమానంగా రాష్ట్రాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం కె.కోటపాడు మండలంలో పది గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ శిథిలాస్థితికి చేరుకున్న లంకవానిపాలెం పీహెచ్‌సీ నూతన భవనాల నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు చేశామన్నారు. తాజాగా ఇవి అన్ని వసతులతో అందుబాటులోకి రావడంతో మెరుగైన వైద్య సేవలు అందనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వారాడలో రూ.1.69 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలు, జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. ఆర్.వై.అగ్రహారంలో రూ.87 లక్షలతో పూర్తయిన సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలు, సూర్రెడ్డిపాలెంలో రూ.60 లక్షలతో పూర్తయిన సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనం, కె.సంతపాలెంలో రూ.1.88 కోట్లతో పూర్తయిన సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలను, సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంకు, కింతాడలో సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలు, గొల్లలపాలెంలో జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన మంచినీటి పథకం పనులను ప్రారంభించారు. అనంతరం రూ.2.40 కోట్లతో పూర్తి చేసిన కింతాడ-లంకవానిపాలెం తారురోడ్డు పునర్నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరించారు. గొందుపాలెం-మురుగుపాలెం మార్గాన్ని రూ.2 కోట్లతో చేపట్టిన తారురోడ్డును, మరో రూ.2.78 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, 60 వేల లీటర్ల మంచినీటి ట్యాంక్, ఇంటింటి కుళాయిలు, గుల్లేపల్లిలో రూ.1.64 కోట్లతో పూర్తి చేసిన సచివాలయం, సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ నిధులతో ట్యాంక్ నిర్మాణం, ఇంటింటి కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, ఏటూలు బాలాజీ అప్పారావు, అల్లు శ్వేత, పీ రామ్మూర్తి, లక్ష్మణరావు, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, గొర్రుపోటు సౌజన్య, రొంగలి రాము, బండారు ఈశ్వరమ్మ, బండారు ముత్యాలనాయుడు, చల్లా మంగ, బండారు కనక మల్లీశ్వరి, బండారు దేముళ్లు, మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు(నాని), ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, నెక్కల గోపి, చీపురపల్లి అచ్చిబాబు, లెక్కల శంకరరావు, పల్లా కన్నమ్మ, ఆకుల సాయిప్రసాద్, పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్



సభకు వేలాదిగా హాజరైన మహిళలు, కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

- అక్కచెల్లెమ్మలకు నాల్గో విడత డ్వాక్రా రుణమాఫీ
- ఆసరా చెక్కుల పంపిణీ సభలో విప్ ధర్మశ్రీ

రావికమతం: మాట తప్పని మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. నాలుగు విడతల్లో రూ.25,552 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేసి అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం కొత్తకోట హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఇక్కడ బహిరంగ సభలో ధర్మశ్రీ మాట్లాడుతూ నాడు చంద్రబాబు, ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేసిన కేఎస్ఎన్ రాజు బ్యాంకు రుణాలు చెల్లించొద్దని, తాకట్టు పెట్టిన బంగారం తెచ్చి ఇచ్చేస్తామని ప్రగల్భాలు పలికారని విమర్శించారు. గెలిచిన తర్వాత ఎవ్వరికైనా తాకట్టు పెట్టిన బంగారం తెచ్చి ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఆనాడు వారి మాటలు నమ్మి వడ్డీలు చెల్లించని వారికి అప్పులు తడిసిమోపుడయ్యాయని వాపోయారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. నాడు జన్మభూమి కమిటీలు దోచుకున్నాయని దుయ్యబట్టారు. నేడు ఏ నాయకుడైనా లంచాలు అడిగారా? మీరెవ్వరికైనా ఇచ్చారా అని ప్రశ్నించగా? లేదు.. లేదంటూ.. మహిళలు ముక్తకంఠంతో పలికారు. అనంతరం రావికమతం మండలానికి రూ.11.89 కోట్ల చెక్కు, రోలుగుంట మండలానికి రూ.7.27 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీలు పైల రాజు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రావికమతం మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు పాల్గొన్నారు.

మునగపూడిలో షర్మిలకు చేదు అనుభవం.!


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల


నిలదీస్తున్న లోవరాజు మైక్ తీసుకునే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- చార్జిషీట్‌లో వైఎస్సార్ పేరు చేర్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించమంటారా?
- మునగపూడి రచ్చబండలో నిలదీత

నాతవరం: మునగపూడి రచ్చబండ కార్యక్రమంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు చేదు అనుభవం ఎదురైంది. ఆమె వ్యవహారశైలిని విమర్శిస్తూ స్థానిక వైఎస్సార్ అభిమానులు నిలదీశారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొచ్చిన మహానేత వైఎస్సార్ పేరును.. ఆయన మరణాంతరం చార్జిషీట్‌లో చేర్చి వారి కుటుంబాన్ని వేధింపులకు గురిచేసిన విషయాన్ని శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన రచ్చబండ సాక్షిగా ప్రశ్నించారు. వైఎస్సార్ బిడ్డగా అలాంటి పార్టీలో మళ్లీ ఎందుకు చేరారు..? అంటూ వైఎస్సార్ అభిమాని లోవరాజు నిలదీశారు. వైఎస్సార్‌ను, ఆయన కుటుంబాన్ని అవమానించిన పార్టీలో కాకుండా మరే పార్టీని గెలిపించమన్నా.. వైఎస్సార్ బిడ్డగా మద్దతు ఇచ్చేవాళ్లమని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి సమస్యలు లేవని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రశంసించారు. దీంతో షర్మిల ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. పది నిమిషాలపాటు సమాధానం చెప్పలేక తెల్లముఖం వేశారు. ఈ క్రమంలో అతడి నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు మైక్ లాక్కొన్నారు. అంతలోనే షర్మిల కలగజేసుకుని తనను మాట్లాడనివ్వండని నాయకులకు సూచించారు. లోవరాజు మాట్లాడుతున్నంత సేపు సభలో ఉన్న వారంతా ఈలలతో సందడి చేశారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ వైఎస్సార్ పేరు చార్జిషీట్‌లో చేర్చిన విషయం సోనియా, రాహుల్ గాంధీలకు తెలియదని తన దగ్గర బాధపడ్డారన్నారు. రాష్ట్రంలో అధికార పక్ష, ప్రతి పక్ష నాయకులు బీజేపీ పెద్దల కాళ్లకు మొక్కుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టులాంటివి పూర్తవ్వాలంటే మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షులు ఎస్.రఘువీరా రెడ్డి, రుద్రరాజు, పీసీసీ సభ్యుడు శ్రీరామమూర్తి, నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి సుబ్బన్న, సన్యాసిరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నేడు

అనకాపల్లి : స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఎన్టీఆర్ మార్కెట్ యార్డు గుమస్తాల సంఘం కార్యాలయంలో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి యల్లపు సాంబశివరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయుర్వేద వైద్యులు శ్రీనాథ్ సిద్ధి విచ్చేస్తారన్నారు. క్లబ్ సభ్యులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అపార్ట్‌మెంట్ వాసుల సమస్య పరిష్కరించాలి



శేషమ్మ మృతదేహంతో శ్మశానవాటిక వద్ద బంధువులు, అపార్ట్‌మెంట్ వాసులు

అనకాపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని శంకరం పంచాయతీలో గల వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అపార్ట్‌మెంట్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు ఎం.సన్యాసిరావు, నివాసితులు కోరుతున్నారు. అపార్టుమెంట్‌లోని 25వ నంబర్ బ్లాక్‌లో నివసిస్తున్న బి.శేషమ్మ (70) అనారోగ్య కారణంగా శుక్రవారం రాత్రి మృతి చెందగా శంకరం పంచాయతీలోని హిందూ శ్మశాన వాటికకు తీసుకెళ్తుంటే అక్కడి ప్రజలు అడ్డుకోవడంతో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి పట్టణంలోని శారదా నది ఒడ్డునున్న హిందూ శ్మశాన వాటికకు తీసుకు వచ్చి దహనం చేశామన్నారు. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోనూ ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నామన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు నేడు

అనకాపల్లి : మెయిన్‌రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా నగర సంకీర్తన, అమ్మవారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, కన్యకా పరమేశ్వరి ప్రార్థనా గాన సంఘం వారిచే నిత్య ప్రార్థనలు, లలితా సహస్ర నామ స్తోత్రపారాయణ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 7.30కు 102 వెండి ప్రమిదలతో జ్యోతుల ఆరాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి కటకం లక్ష్మణరావు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 7,551 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,690
మొదటి రకం	3,440	4,120
రెండో రకం	3,370	3,640
మూడోరకం	3,250	3,500

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్తిసాయి
గేమ్ ఆన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 377 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 431 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

రూపుదిద్దుకుంటున్న పేదల లోగిళ్లు






నా పేరు కరణం పుష్పవతి. నా భర్త ఆటో డ్రైవర్. మాకు ఇద్దరు ఆడపిల్లలు. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో ఉంటున్న మాకు సొంతిల్లు లేదు. పిల్లలతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి నిధులు ఇస్తారని స్థానిక నాయకులు చెప్పినా స్థలం లేక సొంతిల్లు నిర్మించుకోలేకపోయాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు ఇల్లు లేని విషయం గుర్తించి జగనన్న లేఅవుట్‌లో నా పేర ముందుగా స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ. లక్షా 80 వేల నగదు అందించారు. దీంతో పాటు డ్వాక్రా ద్వారా రూ.30 వేలు వడ్డీ లేని రుణం ఇచ్చారు. శరవేగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోగలిగాం. మాలాంటి వాళ్ల కోసం సీఎం జగన్ చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకం ఎంతో బాగుంది. ఉచితంగా స్థలం, ఇళ్లు ఇవ్వడమే కాకుండా విద్యుత్, మంచినీరు, రోడ్ల వంటి సౌకర్యాలు కూడా కల్పించారు. మేము ఎల్లప్పుడూ జగనన్నకు రుణపడి ఉంటాం. జగనన్నకు రుణపడి ఉంటాం..

- జగనన్న లేఅవుట్లతో పేదల సొంతింటి కల సాకారం
- మండలంలో 2,697 మందికి ఇళ్లు మంజూరు
- ఉచిత రిజిస్ట్రేషన్‌తో శాశ్వత హక్కు

తుమ్మపాల : ప్రతి గ్రామంలో జగనన్న లేఅవుట్లు ఊళ్లుగా రూపొందాయి. పేదవాడి సొంతింటి కల నెరవేరేలా సీఎం జగన్ ప్రజలకు సొంత స్థలంతో పాటు ఇంటిని కూడా మంజూరు చేసి జగన్నన లేఅవుట్లు ఏర్పాటు చేశారు. దీంతో జగనన్న లేఅవుట్లు పేదల లోగిళ్లుగా అందంగా రూపుదిద్దుకున్నాయి. రోడ్లు, విద్యుత్ కాంతులు, నీటి సౌకర్యం వంటి సకల సదుపాయాలతో ఈ లేఅవుట్లు కళకళలాడుతున్నాయి. ఎన్నో ఏళ్ల తమ కల కలగానే మిగిలిపోతుందని పేదలు దిగాలు పడేవారు. అటువంటి సమయంలో జగనన్న వచ్చి నేనున్నానంటూ ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేశారు. ఆ ఇళ్లపై పూర్తి హక్కు పొందేలా ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తోంది. పదేళ్ల తర్వాత అమ్ముకునే అవకాశం కూడా కల్పిస్తోంది.

జగనన్న కొత్త ఊళ్లు..

మండలంలో 31 గ్రామ పంచాయతీలకు గాను 43 జగనన్న లేఅవుట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



ఊరును తలపిస్తున్న జగనన్న లేఅవుట్

గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేని కొన్ని చోట్ల ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లు ఇప్పుడు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. మండలంలో మొత్తం 2,697 మంది అర్హులకు గృహాలు మంజూరు జరిగింది. కరోనా, వర్షాల కారణంగా మందకొడిగా సాగిన ఇళ్ల నిర్మాణం ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంది. దాదాపు 1287 ఇళ్ల వరకు పునాదులు పూర్తయి గోడల స్థాయికి చేరుకున్నాయి. 660 గృహాల వరకు శ్లాబులు పూర్తి కాగా, ఇప్పటికే 450 గృహాల్లో లబ్ధిదారులు ప్రవేశించి నివాసముంటున్నారు. మరో 300 గృహాల్లో మంచి రోజు చూసుకుని దిగేందుకు లబ్ధిదారులు సిద్ధపడుతున్నారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో వేగంగా పనులు జరిగి మార్చి నాటికి పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పన..

వైఎస్సార్ జగనన్న లేఅవుట్లకు రోడ్లు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ వగైరా మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు వెచ్చించింది. ఆయా శాఖల అధికారులు క్రమపద్ధతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గృహ నిర్మాణ పనుల కోసం ఇప్పటికే అన్ని గ్రామాల్లో లేఅవుట్ల వద్ద బోర్లు వేశారు. నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రతి ఇంటి వద్ద కుళాయి కనెక్షన్లు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థను పూర్తి చేశారు. పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. అధికార యంత్రాంగం రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.

సొంత స్థలాలుంటే నిధులు మంజూరు..

సొంత స్థలం ఉన్న వారు సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఒక్కో ఇంటికి రూ. లక్షా 80 వేలు అందిస్తున్నారు. మండలంలో ఇప్పటికి 450 మందికి ఇళ్లు



పూర్తయిన నూతన గృహం

మంజూరు చేశారు. వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికి 144 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. పనులు చేసుకుంటున్న వారికి వెంటనే బిల్లులు చెల్లిస్తున్నారు.

జగనన్న వల్లే కల నెరవేరింది..



నా పేరు వారాది కృష్ణమ్మ. రేబాక గ్రామంలో నివసిస్తున్నాను. నిరుపేదరాలినైన నేను ఒంటరిగా జీవిస్తున్నాను. నా సోదరుడి ఇంట్లో ఉండే నాకు సొంతిల్లు లేదని గుర్తించి జగనన్న నాకు మా గ్రామంలోనే సొంత స్థలం ఇచ్చి రూ.లక్షా 80 వేలతో ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం చేశారు. ఇప్పుడు నేను నా ఇంట్లో స్వేచ్ఛగా ఉంటున్నాను. విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించారు. రోడ్డు కూడా వేశారు. ఇంటి నిర్మాణం జరిగినప్పుడు వలంటీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వచ్చి నిర్మాణం వేగంగా జరిగేలా సహకరించారు. ఎప్పటికప్పుడు బిల్లులు పెండింగ్ లేకుండా నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. నాలాంటి వారి సొంతింటి కల సాకారం చేసిన జగనన్నే మళ్ళీ సీఎం కావాలి.

– వారాది కృష్ణమ్మ,
లబ్ధిదారు, రేబాక గ్రామం

ప్రతి దళిత వాడను పంచాయతీ చేయాలి





సభలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు, దళితవాడ పంచాయతీ సంకల్ప సాధన సభకు హాజరైన దళితులు

- ఏటా రూ.2 కోట్లు కేటాయించాలి
- కుల గణన పూర్తయితే చేస్తామని సీఎం హామీ ఇచ్చారు
- మిగిలిన పార్టీలు కూడా మేనిఫెస్టోలో చేర్చి ప్రకటన చేయాలి
- ఎయిమ్ వ్యవస్థాపకుడు, అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్
- పాయకరావుపేటలో రాష్ట్ర స్థాయి దళిత సదస్సు

నక్కపల్లి /పాయకరావుపేట : రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి జనాభా దాటిన ప్రతి దళిత వాడను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని, అభివృద్ధి పనుల కోసం ఏటా రూ.2 కేటాయించాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర వ్యవస్థాపకుడు, ఏపీ అడిషనల్ డీజీపీ(ఫైర్ సర్వీసెస్) పి.వి.సునీల్‌కుమార్ కోరారు. శనివారం పాయకరావుపేటలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో దళితవాడ సాధన సంకల్ప సభ జరిగింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి దళితులంతా తరలివచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్ హాజరయ్యారు. ఆయనను పాయకరావుపేట పట్టణంలో ఘనంగా ఊరేగిస్తూ సభావేదిక వద్దకు తీసుకు వచ్చారు. వేదిక వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేశ జనాభాలో 20 శాతం దళితులున్నారన్నారు. వీరంతా తమను ఎంపీలను, ఎమ్మెల్యేలను, మంత్రులను చేయాలని కోరడం లేదన్నారు. దళిత వాడలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, వెయ్యిజనాభా దాటిన ప్రతి దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కోసం ఏటా రూ.రెండు కోట్లు కేటాయించాలని కోరుతున్నారన్నారు. ఇదే విషయమై అంబేడ్కర్ ఇండియా మిషన్ తరపున ఇటీవల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేయాలని కోరడం జరిగిందన్నారు. అందుకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కులగణన జరుగుతోందని, అది పూర్తయిన తర్వాత వెయ్యి జనాభా దాటిన దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించి నిధులు కేటాయించేందుకు అంగీకరించారన్నారు. ఇది అమల్లోకి వస్తే రాష్ట్రంలో 1500 దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలు కానున్నాయన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు దళిత వాడలకు వచ్చే రాజకీయ పార్టీల నాయకులు దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేసే అంశాన్ని మీ పార్టీల మేనిఫెస్టోలో ప్రకటించాలని సునీల్ కుమార్ కోరారు. దళిత బిడ్డలంతా ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను ఇదే విషయమై డిమాండ్ చేయాలని సూచించారు. రూ.లక్ష కోట్ల బడ్జెట్ ఉంటే దళిత జనాభా దామాషా పద్ధతిలో రూ.18వేల కోట్లు దళితుల కోసం కేటాయించాలన్నారు. ఎస్సీలకు బ్యాంకర్ల గ్యారంటీ లేకుండా రుణాలు ఇవ్వాలని దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, ప్రధాని మోదీ కూడా ఇదే పద్ధతిలో ముద్ర రుణాలు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ బ్యాంకర్లు ఇవ్వడం లేదన్నారు. దళితులు ఇక నుంచి ప్రత్యేక దళితవాడ పంచాయతీలు సాధించుకోవడానికి పోరాటం చేయాలన్నారు. వివక్ష లేకుండా ఉండడం కోసమే దళిత వాడను ప్రత్యేక పంచాయతీ చేయాలని కోరుతున్నామన్నారు. మనకు ఏ ప్రభుత్వం మేలు చేస్తే వారికే అండగా నిలబడదామన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర నాయకులు సాకేటి విజయ్‌కుమార్, పైడికొండ శ్రీను, జాలాది విజయ, కొల్లా బత్తుల దిలీప్, జల్లు చినబాబు, మోహన్‌కుమార్, జెడ్పీటీసీలు లంక సూరిబాబు, కాకర దేవి, సర్పంచ్ గారాప్రసాద్, నియోజకవర్గ దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్, ఇంజరపు సూరిబాబు, పల్లా విలియం కేరి, ఐఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు



క్యూలైన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ నాయుడు

అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 16న రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రథసప్తమి రోజున సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, అన్నసమారాధన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, ఆలయ అర్చకులు విద్యాసాగర్ శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న పట్ల హర్షం

అనకాపల్లి : బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం అభినందనీయమని అనకాపల్లి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కె.వి.గౌరీపతి అన్నారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో పదవులకే వన్నె తెచ్చిన మహానుభావుడన్నారు. నూకాంబిక దేవస్థానం ధర్మకర్త కొండూరు రవీంద్రనాథ్, అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు జయంతి నాగలింగ శాస్త్రి, సభ్యులు జీఎస్ఆర్ శేషగిరిరావు, వెంపరాల శర్మ తదితరులు పాల్గొన్నారు.

కేజేపురంలో ఉచిత పశు వైద్య శిబిరం

మాడుగుల రూరల్: సుమోటో ఫైనాన్స్ గ్రూపు ఇండియా సౌజన్యంతో శనివారం కేజేపురంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ వి. చిట్టినాయుడు హాజరై పాడి రైతులకు పశుగ్రాస పెంపకం, కిసాన్ క్రెడిట్‌కార్డు, రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం 34 పశువులకు గర్భకోశ పరీక్షలు, 28 పశువులకు నట్టలనివారణ, 42 పశువులకు పేడ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ జామి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



పశువులను పరీక్షిస్తున్న ఏడీ చిట్టినాయుడు

రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలి

అనకాపల్లి : సుంకరమెట్ట రహదారిని నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించడం అభినందనీయమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. సుమారు 20 సంవత్సరాల సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించడంతో పట్టణ వాసులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతంలో పెద్దపెద్ద గోతులతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, కొంత మంది వాహన చోదకులు మృత్యువాత పడిన సందర్భాలు, క్షతగాత్రులైన ఘటనలు ఉన్నాయన్నారు. నేటి ప్రభుత్వంలో రెండు లైన్ల రహదారిని నాలుగులైన్లుగా విస్తరించారన్నారు. అయితే వర్షాలు పడే సమయంలో వర్షపు నీరు రహదారులపై నిలిచిపోయి శిథిలావవస్థకు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకుని రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ నిర్మిస్తే పదికాలాల పాటు రహదారికి ఎటువంటి సమస్యలు ఉండవన్నారు.



సుంకరమెట్ట రహదారి

ముగ్గురు సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

కశింకోట : సెల్‌ఫోన్లు దొంగిలించి దొరికిపోయిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. మండలంలోని కన్నూరుపాలెంలో వర్రి చిన్న అక్కునాయుడు ఇంట్లో ప్రవేశించి శుక్రవారం రాత్రి విశాఖపట్నం పాత పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన నక్కబోయిన శివశంకర్ (30), నక్కబోయిన రాజేష్ (28), చేపల ఉదయశంకర్ (25) కలిసి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. ఈ సందర్భంగా రెండు సెల్‌ఫోన్లు తస్కరించి పరార్ అవుతుండగా చప్పుడు కావడంతో అక్కునాయుడు దొంగలను గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పట్టుకున్నారన్నారు. ఈ మేరకు సమాచారం అందించారన్నారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి దొంగలను పట్టుకుని అరెస్టు చేశామని, వారి నుంచి తస్కరించిన రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు నర్సీపట్నం వద్ద బొడ్డపల్లి వెళ్లి ఆటోలో తమ ఇంటికి విశాఖ వెళ్తూ మార్గమధ్యలో కన్నూరుపాలెంలో ఆగి ఈ దొంగతనానికి పాల్పడి దొరికిపోయారన్నారు. వారిని అనకాపల్లి కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జనసేన, టీడీపీ ప్రభుత్వంలో విద్య, వైద్యం ఉచితం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

తుమ్మపాల : జనసేన, టీడీపీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తేనే ఎన్నికల్లో గెలుపు సాధ్యమని, త్వరలో జనసేన, టీడీపీ ప్రభుత్వం రానుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు జోస్యం చెప్పారు. అనకాపల్లి టౌన్‌లో గల జనసేన కార్యాలయంలో జనసేన సైనికులతో నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించడమే లక్ష్యంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కార్యాచరణ రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు జనసేన కృషి చేస్తుందన్నారు. అనకాపల్లిని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య దోమలు, ఇక్కడి ఐటి మంత్రి అన్నారు. అనకాపల్లి నుంచి టీటీడీకి వెళ్లే బెల్లాన్ని నిలిపేసి ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బ తీశారన్నారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని మూసేశారని, యువతకు ఉద్యోగాలు లేవని విమర్శించారు. జనసేన నాయకులు సుందరపు సతీష్ కుమార్, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ యాదవ్, పరుచూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరమ్మ ఊరేగింపును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ



మలసాల భరత్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు



మహిళల కోలాట ప్రదర్శన

కశింకోట: స్థానికంగా ప్రసిద్ధి చెందిన గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. మాజీ ఎంపీపీ మలసాల కాసులమ్మ(ధనమ్మ) రథోత్స ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను ఉత్సవ కమిటీ తరపున శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. మేళ తాళాలు, సంచార ఆర్కెస్ట్రా, మహిళల కోలాటాలతో ఆలయం నుంచి ఉత్సవం బయలుదేరి గ్రామ ప్రధాన వీధుల మీదుగా సాగింది. ఈ సమయంలో దారి పొడవునా ప్రజలు గౌరమ్మను దర్శించుకుని అరటి గెలలు, చీరలు, రవికెల రూపంలో కానుకలు సమర్పించారు. అలాగే ఉదయం నుంచి గౌరమ్మను ప్రజలు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవం సందర్భంగా ప్రధాన పంచాయతీ రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆహూతులను అలరించింది. దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకున్నాయి. ఆకాశ చక్రం, ఫోం జారుడు బల్లపై పిల్లలు తిరుగాడి ఆనందంగా గడిపారు. పెద్ద ఎత్తున ఆట వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, ఇళ్ల అలంకరణ, గాజు వస్తువులు, పింగాణి పాత్రలు, దేవతామూర్తుల బొమ్మలు, వంట సామాన్ల అమ్మకాలు జోరుగా సాగాయి. నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథలు, ఆర్కెస్ట్రా, నేల వేషాల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రసాద వితరణ చేశారు. గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, బొడ్డేడ సత్యసాయి బాలాజీ, భీశెట్టి ఆనంద్, వేగి దొర బాబు, వేగి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, అనకాపల్లి వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణరావు దర్శించుకున్నారు. అలాగే టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు అమ్మవారిని దర్శించుకుని శాశ్వత నిధికి రూ.2 లక్షల విరాళం అందజేశారు.